రాన్ని గట్టిగా అదిమిపట్టుకొని 'చెప్పు వకుళం నీకేమీ భయంలేదు. నేనున్నానుగా' అన్నాడు.

హృదయంలో ఘూర్ణిస్తున్న ఆవేదన ఉప్పెనలా బైటికి పొంగివచ్చి కన్నీటి ధారలుగా ప్రవహిస్తూంటే, గుండె రాయిచేసుకొని వకుళం తన భర్త వేసిన ప్రశ్నకు జవాబు చెప్పింది.

"క్షమించండి! నేను చేసినది మహాపరాధం. మీకు చాలా ద్రోహం చేశాను. ఆడ పిల్లలను కనిన తల్లిదండ్రుల బాధా ఫలితం అది. దానికి బాధ్యురాలను నేను. సత్యదూరం కాని లోకాపవాదు మీరెరుగరు. అది మీ నేలను స్పృశించలేకపోయింది. అమాయకంగా కుల గౌరవ సంప్రదాయాలకు కట్టుబడి, అంగీకారాన్ని చూపింది మీ సహృదయత. కాని దానితో నాఆవేదన అంతకంతకు అధికంఅయిపోయింది. స్వచ్ఛ స్ఫటిక సన్నిభమైన మీ హృదయానికి నాలో దాగిన రహస్యాన్ని నివేదించుకుంటాను. ఈ జీవితం ఏమయిపోయినాసరే, పెను ప్రళయంలో ఎక్కడికో కొట్టుకు పోయినాసరే, నాలో దాగిన రహస్యం, అందుమూలంగా శరీరాత్మలను దహించివేస్తున్న బాధ, శరీరంలోని నెత్తురు మూలంగా స్రవించిపోతే నా బాధోపశమనం అవుతుందని ఆశపడుతున్నాను. నా శరీరాత్మలపై ఈ క్షణం నుండి సర్వాధికారం చలాయించగల మీకు అభ్యంతరంలో మృగ్యం కాగల వస్తువులేదు! పరీక్షచేసి శిక్ష విధించడి! అని అంటూ అమాయకత్వం ఆకృతి వహించి, అచేతనంగా ప్రతిమలా నించున్న వకుళాన్ని ఒక దివ్యానుభూతితో గట్టిగా కౌగిలించుకున్నాడు శ్రీధరరావు. మహాసముద్రం వంటి తన హృదయపు లోతుల్లోంచి అనిర్వచనీయమైన అంతశ్శుద్ధి, దయ, ప్రేమ, అనురాగం సహానాలుగా పొంగి పొర్లిపోతూంటే "పిచ్చిదానా! ఈపాటి దానికేనా మనస్సును కష్టపెట్టుకున్నావు. అదినాకే సంభవించి ఉంటే? లోకం నాకోసమని నిన్ను నిరాకరించింది! నిన్ను పరిగ్రహించమని విధి నన్ను ఆజ్ఞ పెట్టింది బాధపోయేటట్టు నవ్వు వకుళం ఒక్కసారి! అని తన అర్ధాంగి కన్నీరు తుడుస్తూ, ఆమె లలాటాన్ని ఒక్కసారి చుంబించి ఎదురుగా ఉన్న గడియారం వైపు చూసేసరికి అర్ధరాత్రి అయింది. భూతల స్వర్గంలో ఆ యిద్దరూ ఆనంద నిమగ్నులయిపోయారు.

సముద్రతీరాన్ని నవ్విన వకుళం నవ్వుకు కారణం సముద్రం అంత లోతుగలదై ఉండాలని ఇల్లు చేరుకున్న తరువాత తెలుసుకొని తను కూడా నవ్వేడు శ్రీధరరావు, ఆనవ్వుల సముద్రపు లోతులు తెలుసుకోడానికి!

చైతన్య స్రవంతి

# నిష్కామ యోగం

"అమగశ్రీ"

భార్యమీద అలిగిన వెంకట్రావు వీధిన బడ్డాడు రాత్రి పదకొండు గంటలకు. సగం చీకటి సగం వెలుతురులో బజారంతా ఆదో రకంగా ఉన్నది. జేబులో చెయ్యి పెట్టాడు. ఒక సిగరెట్ పాకిట్, అగ్గిపెట్టె, కాస్త చిల్లర చేతికి తగిలినయ్. సిగరెట్ వెలిగించి ముక్కుకు నూటిగా బయలుదేరాడు.

ఈవిధంగా ముక్కుకు నూటిగా బయలుదేరి ఎన్నాళ్ళయిందో? ఎప్పుడో చిన్నతనంలో బళ్ళో చదువుకొనేటప్పుడు, పెళ్ళికాక ముందు మాట అదంతా. పెళ్ళయిన తరువాత మాత్రం? గుదిబండ మెళ్ళో ఉన్నా, ముక్కుకు నూటిగానే పోయాడు కొన్నాళ్ళు. రోజురోజుకూ తను పెద్దవాడయ్యాడు. గుదిబండ కూడా పెద్దదయి బరువెక్కింది. అందువలన ఈమధ్య స్వైర విహారాలరుచి అసలు ఎరుగనేఎరగడు.

మొత్తంమీద ఈపూట తను బయట పడగలిగాడు. ఎలాగైతే నేం? అదంతా తరువాత

విషయం. బయటపడటం మనకు కావలసింది అనుకున్నాడు వెంకట్రావ్. ఎలా బయటపడ గలిగాడు? పెళ్ళాంమీద అలిగాడు. మొగుడి మీద పెళ్ళాం అలుగుతుంది అప్పుడప్పుడు, చీర కొనిపెట్టలేదని, మెళ్ళోకి గొలుసు చేయించ లేదని. భర్తల బాధలు భార్యలకేం తెలుసు? భార్యల బాధలుమాత్రం భర్తలకేం తెలుసు?

తను పెళ్ళాంమీద అలిగి ఇంట్లోనుంచి బయటకువచ్చి ఎక్కడికో పోతున్నాడు. ఆడ దానిమీద అలగటమా? ఆడదేమిటి? మొగ వాడేమిటి? అందరూ సమానమే. తను అలగ టంలో తప్పులేదు. సమానత్వం,సౌభ్రాతృత్వం, తరువాత మాట జ్ఞాపకం రావటంలేదు.

పెళ్ళయిన కొత్త రోజులలో బుద్ధిపూర్వ కంగా పెళ్ళాంతో పోట్లాడేవాడు తను. పెళ్ళాంతో పోట్లాడటం ఎంత బాగుంటుంది? అనుకొనే రోజులవి. పెళ్ళాంమీద అలిగి ఒక రోజు అన్నం తినకుండా అలానే ఉండిపో వటం, మరునాడు ఉదయం తను లేచేసరికే, ఒక చేతిలో ఉప్మా ప్లేటు, మరో చేతిలో కాఫీతోనూ ఆమె సాక్షాత్కరించి తనను బతిమలాడటం... అదంతా ఒక పీడ కల. నిజం.

పెళ్ళి కాకముందే బాగున్నది. పెళ్ళయిన తరువాత రకరకాల అలకలు. అసలు పెళ్ళి లోనే అలకలు కొన్ని. అలకలో ఉన్న సౌం దర్యాన్ని, సొగసునూ మన పూర్వీకులే కని పెట్టేశారు. ఇంక మనం కనిపెట్టేదేముంది? ఇప్పుడేమన్నా మనం ఒక కొత్త విషయాన్ని కనిపెట్టినా, "అది మా చిన్నతనంలోనే తెలుసు మాకు" అంటారు. కాబట్టి అసలు కొత్త విషయాలను కనిపెట్టటం మానుకోవటమే మంచిది. అందుకనే అలకలోని మాధుర్యం ప్రతి పెళ్ళికొడుకూ ఆస్వాదించటం కోసం పెళ్ళి కార్యక్రమంలోనే ఏర్పాటు చేశారు దానిని. ఆ ఆస్వాదన చాలక వెంకట్రావు పెళ్ళయిన తరువాత గూడా కొన్నాళ్ళ వరకు అలకలు సాగించాడు. అలకలలోని మాధు ర్యం వివాహితుల కొక్కరికే తెలుసు. వెంక ట్రావు సిగరెట్ పొగ గట్టిగా పీల్చాడు. నడక వేగం హెచ్చింది.

పెళ్ళి కాకముందు జీవితం ఇంతకంటె బాగున్నది. పెళ్ళయిన తరువాత, భార్యతో ఊహా సంభాషణలు సృష్టించుకొంటూ, కాబోయే పెళ్ళాం, తనంటే చూపబోయే ప్రేమను ఊహించుకొంటూ, సిగరెట్ తాగుతూ, డాబామీద పడకకుర్చీలో, గుండె మీద పుస్తకం పెట్టుకొని, మేలుకొనే నిద్ర పోతూ ఉండే రోజు మళ్ళా రాదు. ఏ వస్తువు నైనా దూరంగా ఉండే చూడాలి. కలలో ఉంది మాధుర్యం. నిజం చాల అసహజం గానూ, అసహ్యంగానూ ఉంటుంది. కాస్సేపు పెళ్ళి కాలేదనుకున్నాడు. కాదు. అను కుందామని ప్రయత్నించాడు. ఎట్లా అనుకుం టాడు. సినిమాలో క్లోజప్ ఇచ్చినట్లు భార్య మెడలోని మంగళ సూత్రం కళ్ళకు కనబడింది. అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య ఉండగా లేదనుకోవటమే? మన దేశం, సీత, అనసూయ, సావిత్రి ... లెక్కలేదు, ఇటువంటి వాళ్ళందరకూ పుట్టినిల్లు.

ఆకలి వేసింది. ప్రక్కన వెంటనే కనుపిం చింది ఒక కాఫీ హోటలు. మాట్లాడకుండా దూరాడు. తిన్నాడు, తాగాడు, బయట పడ్డాడు. మళ్ళా మామూలే. ఆలోచన తెగ లేదు. ఆకలి చల్లారలేదు. కాఫీ తాగినా, సాంబారు ఇడ్లీ తిన్నా చల్లారలేదు. అది చల్లారదు? శాస్త్రీయ దృక్పథంగా చూస్తే చల్లారాలి. ఆహారం పడవలసింది పడలేదేమో! అనుమానం వేసింది.

చుట్టూ చూశాడు. తను ఇంతకుముందు ఆ కాఫీ హోటలులో తిన్నప్పుడు చూసిన వాడెవడూ కనిపించలేదు. ప్రక్కన మరో హోటలు కనిపించింది. యథాప్రకారం బిల్లు చెల్లించాడు. ఆకలి ఆకలిగానే ఉన్నది. చిన్నప్పుడు సైన్సులో చదువుకొన్న పదార్థ స్థిరత్వం జ్ఞాపకం వచ్చింది. రెండు చీట్లమీద ఆరణాల అంకెలు వేసి మింగితే ఆకలి చల్లారు తుందేమో. ఇటువంటి అశాస్త్రీయమైన పని చేయటమే? అందులో ఈ ఆటంయుగంలో ఆ విషయం మరిచిపోదామని కళ్లుమూసుకున్నాడు. కళ్లు మూసుకున్న దగ్గర్నుంచీ భయం. ఏ రిక్షా వాడు మీద బడతాడోనని.

వెంటనే కళ్ళు తెరిచాడు. కళ్ళు తెరవటం, కాళ్ళు ముడవటంలాంటి పనులు తప్ప మరేవీ చేతగావు. మరిచిపోదామనుకున్న విషయం మరుపుకు రావటంలేదు. అంతా మన యిష్టమేనా? మరోవిషయం జ్ఞాపకం వస్తేనేగాని ఈ విషయం మరుపుకురాదు. ఇది రెండో సమస్య. మరో విషయాన్ని గుర్తు తెచ్చుకోవటం ఎలా?

ఆలోచించాడు. ప్రొద్దున ఏం జరిగింది? అంతా శూన్యం. ఏమీజరగలేదు. ఏమీ జరగకుండా ఎలాఉంటుంది? ఏదో జరిగింది. గుర్తుకు రావటంలేదు. పోనీ, మధ్యాహ్నంపూట ఏవీ జరగవు. అసలు మధ్యాహ్నం ఏం చేయటం సంభవించింది? నిద్రపోవటం సంభవించింది. చిన్నప్పుడు బడిపంతులు వేసిన ప్రశ్నలూ, చెప్పిన సమాధానాలూ, చెప్పకపోతే వీపుమీద పడినదెబ్బలూ జ్ఞాపకం వచ్చినయ్. పోనీ, ఏదోఒకటి జ్ఞాపకం వచ్చింది కదా, అనుకుంటే అంతకంటె ఆలోచన ఒక్క అడుగు కూడా ముందుకు పోలేదు. ఇంతకుముందు ఆలోచిస్తున్న విషయం ఏమిటి? అదికూడా జ్ఞాపకం రావటంలేదు. అంతా శూన్యం.

ఇంతలో ఒక మెఱుపు. జ్ఞాపకం వచ్చింది మధ్యాహ్నం పోయిననిద్ర. మధ్యాహ్నం నిద్ర పోతేగా? అన్నీ కలలు. గాంధీగారికి మాంసం తిన్నప్పుడు వచ్చినట్లు. ఆయనకు మాంసం తినగానే వచ్చినయ్ కలలు. తిన్న కొన్ని నెలలకు గాని, కొన్ని నెలలు తిన్న తరువాత గాని రావు మనకు. మాంసం తినటం పాపం. ఏది పాపంకాదు? తినటం పాపంకాదుగా! జీవహింస పాపం. అది కూడా అహింసావాదులకు. హింసావాదికి ఏది పాపం? మాంసం తిన్న తరువాత కల్లుసారాయి త్రాగటం. ఇది సహించరాని విషయం? ఎలా? శుక్రాచార్యుల వారు సురాపానం చేశారు. నేను చేసినా ఫరవాలేదు. రాక్షసులకు గురువుని కాదుగా. కాకపోయినా ఫరవాలేదు.

అదంతా వేరేవిషయం. బ్రాహ్మణకులంలో పుట్టి ఇటువంటి అప్రాచ్యపు పనులు ఎవరన్నా వింటారేమో. ఈమాట పెద్దగా అన్నానా? లేదు. మనస్సు స్థిమితపడ్డది. వెనుకబడిన జాతుల మహాసభలు జ్ఞాపకం వచ్చినాయి. వాళ్ళ నినాదాలుజ్ఞాపకంవచ్చాయి. వెనుకబడిన జాతులన్నీ ముందుకురావాలి. ముందుబడినజాతులన్నీ వెనుకకు ఎందుకు పోకూడదు? వెనుకకువచ్చి మిగిలినవాటితో కలిసి ఎందుకు సాగిపోగూడదు. కావలసినది సమానత్వంగా. వెనుకబడిన జాతులు ముందుకు పోతేనేం? ముందుబడిన జాతులు వెనుకకు పోతేనేం? కావలసినది అన్నీ సమానం కావటమయినప్పుడు ఏపని చేస్తేనేం?

ముందుబడిన జాతుల మహాసభలు ఏర్పాటు చేసి అవి వెనుకకుపోయే ఏర్పాట్లు కొన్ని చేయిస్తే? గొప్ప విషయం స్ఫురించింది. అసలు జాతులు వెనుకబడటమేమిటి? అలా [illegible] కూడదు. అభ్యుదయ నిరోధకుడు కావాలనుకుంటాడా ఎవరన్నా? తను అనుకున్నట్లు వెనుకబడిన జాతులను అట్లా ఉంచి, ముందుబడిన జాతులను వెనుకకు తిప్పాలని ఎవడన్నా అంటే, వాడు ప్రాణాలమీద ఆశ వదులుకొనే అనాలి ఆ మాట. అభ్యుదయ నిరోధకత్వం క్రిందకు వస్తుంది ఇదంతా. ఈ ఉద్దేశ్యాలకు ప్రచారం చేసినవాడు ప్రాణాలమీద ఆశలు వదలుకొని మరీ ప్రారంభించాలి. మిగలకుండా ప్రాణాలు తోడేస్తారు. మళ్ళా అన్నీ ఉన్నాయి. పత్రికా స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, భావస్వాతంత్ర్యం — వాటి దుంపతెగ? వాటి పేర్లే జ్ఞాపకం రావటంలేదు. అంగడిలో అన్నీ ఉన్నాయి. అల్లుడినోట్లో శని.

అసలు విషయం అడుగున బడిపోయింది. మర్చిపోవాలనుకున్న విషయం మర్చిపోయాను. మర్చిపోవాలనుకున్న విషయం ఏమిటి? జ్ఞాపకం రావటంలేదు. క్షుణ్ణంగా మర్చిపోయాను. మర్చిపోవటంలోగూడ గట్టిగా మర్చిపోయాను. నూటికి నూరుమార్కులు మర్చిపోవాలనుకున్న విషయాన్ని మర్చిపోయానో లేదోనని జ్ఞాపకం జేసుకోవటంతో వచ్చిన మార్కులన్నీ పోయినాయి.

ఆలోచనలన్నీ మాటు మణగటంతో ఆకలి ఉబికింది. ఈ ఆకలి చల్లారటంలేదు. ఎంత తిన్నా చల్లారటంలేదు. అసలు చల్లారదేమో! ఆ పోయ్యేమనిషిని ఆపి కనుక్కుంటే? సమాధానం చెప్పడు సరిగదా, ఒక్కనవ్వు నవ్వి

పోతాడు. నే నేదో తెలివి తక్కువవాడి నయినట్లు, వాడేదో పెద్ద తెలివిగలవాడయి నట్లు ప్రతివాడితోనూ ఇదే ఇబ్బంది. ఇదొక అంటువ్యాధి.

ఆకలిమీదకూడ టాక్సు వేస్తే? చాలా బాగుంది. "ఇన్‌కమ్" టాక్సు, "సేల్స్" టాక్సులా ఆకలిమీద గూడ టాక్సువేస్తే? ఆడిటర్ల సంఖ్య ఎక్కువవుతుంది. ఎంత ఎక్కువ ఆకలి వేసినా తక్కువ వేసిందని చెప్పి తప్పించుకో బోతారు. టాక్సు తప్పుతుంది కదా, అని వాళ్ళ ఉద్దేశ్యం. వాళ్ళు కట్టిన టాక్సుకు సరిపోయేలా ఆహారం సరఫరాచేస్తే సరిపోతుంది. అధికాహారోత్పత్తి చేయనవసరం లేదు. ఉన్న ఆహారాన్నే సరిపెట్టుకోవచ్చు. కాని టాక్సు తగ్గిపోతుంది.

ప్రభుత్వంలో తెలివి లోపించింది. ఎంత టాక్సు చెల్లిస్తే అంత పుణ్యం వస్తుందని ప్రచారము చేస్తే పోటీలుపడి టాక్సు కడతారు మన దేశంలో, ముఖ్యంగా మన ఆంధ్ర దేశంలో. 'షాక్'కు తెలియదు ఈ ప్రపంచంలో ఒక ఆంధ్రదేశం ఉన్నదని. తెలిసి ఉన్నట్లయితే తన ఏజంట్లను పంపేవాడు, ఇక్కడ పాప పరిహార పత్రాలమ్మటం కోసం. తెలివిలేక చెడి పోయే వాళ్ళు కొందరు. తెలివి ఉండికూడ బాగుపడలేని వాళ్ళు మరికొందరు.

పోయిపోయి ఒక సందు చివర నిలబడ్డాడు వెంకట్రావ్. ఒక్క నిముషంసేపు అటూ, ఇటూ కలయచూచాడు. ఇంతలో ప్రక్కన నీడలోనుంచి ఓ నీడ అతనివైపు వచ్చింది.

"వస్తారా, బాబుగారూ?"

ఎక్కడికి? ఎవరు? మాట్లాడకుండా నీడను చూసి భయపడుతున్న వాడిలా, సందుమలుపు తిరిగి మరో బజారులోకి వచ్చాడు. బజారులో లైట్లు ఎక్కువగా ఉన్నయ్. వాటితోపాటు కాంతిగూడ. పిండికొద్దీ రొట్టె.

నడకవేగం తగ్గించి ముందుకు సాగాడు. అది ఒక ఆసుపత్రి. ప్రహరీగోడను ఆనుకొని ఒకతోట. దాని తరువాత ఆసుపత్రి. అంతా లైట్లు. ఒక్క నిముషం ఉన్నచోటనే నిలబడి లోపలివైపుకు చూచాడు. అశోకవృక్షం క్రింద, సిమెంటు బల్లమీద, 'ఫౌంటెన్' ప్రక్కన ఏదో తెల్లటికాంతి. కళ్లు పెద్దవిచేసిచూశాడు. ఎవరో...నర్సు. ప్రమాదం. ఏవో సరసాలు పరపురుషుడితో. నర్సుకు పరపురుషుడేమిటి? అందరూ పరపురుషులే. నర్సులు పెళ్ళిచేసుకో గూడదుగా. పెళ్ళిచేసుకుంటే వాళ్ళలో ఉన్న మృదుత్వం నశిస్తుంది. వాళ్ళ కర్తవ్యాన్నిగూడ మర్చిపోతారు.

వాళ్ళు తననుచూడకముందే తప్పుకొన్నాడు వెంకట్రావ్. ఎదురుగా ఏదో ఒక ముసుగు. సుందరీమణి! లలనాంగి! ఇన్ని మాటలు అనవసరం. మునిసిపల్ దీపం దగ్గిర సరిగ్గా ఆమెను కలుసుకోవాలి. ఆమె ముఖంలోకి చూడాలి. బాగుంటుందో లేదో? అందమైన అమ్మాయో కాదో? తనకెందుకీ బాధ. ఆ అమ్మాయి ఎలాటిదైతే తనకేం? ఈ అర్ధరాత్రివేళ ఒంటరిగా పోవటానికి కారణం? దానివలన తనకు వచ్చే లాభం? ఏమిటి? వెధవ ఆలోచనలు.

ఆమె సమీపించింది. వెంకట్రావ్ మొట్ట మొదటగా ఆమె కళ్ళల్లోకి చూశాడు అలవాటుప్రకారం. గొప్పగా ఉన్నయ్. బ్రహ్మాండంగా ఉన్నయ్. మామూలుగా పై రెండు ముక్కలు అనేస్తాడు వెంకట్రావు దేనినైనా పొగడవలసి వచ్చినపుడు. బ్రహ్మాండంగా ఉన్నవంటే, బ్రహ్మాండమంత పెద్దవనికాదు. ముఖం చాలబాగుంది. మనిషి అంతకంటే బాగున్నది. పాలరాతి విగ్రహంలా ఉన్నది. ఆమె తన భార్యయి ఉన్నట్లయితే! కనీసం తన ప్రేయసి. ఇవీ ఆలోచనలు. తనభార్య ఆమెలా అందంగా లేదనా తను పోట్లాడి ఇంట్లోనుంచి తుర్రున బయటకు వచ్చింది? తన భార్య అందంగా లేకనా? ఈమెకంటె అందంగానే ఉన్నది.

తన జీవితంలో ఎన్నో వందలమంది ఆడవాళ్ళని ప్రేమించాడు. తనుచూసిన అందమైన ప్రతి స్త్రీని ప్రేమించాడు. చూసిన అందమైన స్త్రీలలో తను ప్రేమించనిస్త్రీలేదు. ప్రతిఅందమైన స్త్రీనిచూసి, ఆమె తనభార్యయితే ఎంత బాగుండేదనుకొన్నాడు. ఆ విధంగా కొన్ని వందలసార్లు కొన్నివందల మందిని ప్రేమించాడు. ప్రేమ ఏమిటి? ప్రియుడు ఎవరు? ఏమిటో అర్థం కావటంలేదు. సిగరెట్ పాకెట్ బయటకు తీసి చూశాడు, ఒక్కటి మాత్రం

ఉన్నది. వెలిగించి మొట్టమొదటిసారి గట్టిగా లోపలకు పీల్చాడు.

"ప్రేమ ఏమిటి
ప్రియుడు ఎవరు
ప్రియుడు చలిలో
ఉన్నికంబళి"

అంటాడు ఒక రచయిత. ఒక రచయిత అనేదేమిటి? ఎవరనలేరు? అంటే, ఆ భావాలే తనకు వచ్చినా, అది "కాపీ" కొట్టటంక్రిందకే వస్తుంది. అందుకనే ఆ మాటలు, ఆ భావాలు ఎవరివోననటం. అనాలి. అలా అనకపోతే చోరీ.

ఫరవాలేదు. ఇది ఘరానా చౌర్యం. "సోమర్‌సెట్ మాఘమ్" అంతటివాడు కాపీ కొట్టాడని ఈమధ్య "లండన్ టైమ్సు"లో వ్రాశారు. ఎవ్వరకూ తెలియకుండా కాపీ కొట్టాలి. అదీ అసలు తెలివి. కాపీకొట్టటంలో కూడా తెలివిగా కాపీకొట్టటం. కొందరకు కొన్నికొన్ని విషయాలలోనే ఉంటుంది ప్రావీణ్యం. అది "సోమరసెట్ మాఘమ్" ప్రారబ్ధం.

గడియారంవంక చూశాడు. పన్నెండయింది. ఎందుకీవన్నీ? అసలు విషయాన్ని అవతలపెట్టి ఏమిటి అర్ధరాత్రిపూట ఈమద్దెల దరువు? ముందుకు ఒక్క అడుగుకూడా వెయ్యకూడదనుకొని అక్కడే నిలబడిపోయాడు వెంకట్రావు.

తన పేరు వెంకట్రావ్. తన భార్య పేరు సుజాత. ఇద్దరూ పోట్లాడుకున్నారు ఈరాత్రి. అదీ అసలు విషయం. ఏం చెయ్యాలి? ఆకలవుతున్నది. తీరే విధం కనిపించటం లేదు.

ఇది తీరని ఆకలి. ఏదో తనకు అందకుండా పోతున్నదని వెంకట్రావ్ ఉద్దేశ్యం. లోలోపల ఏదో మంట. పైకిపోతున్న వాళ్ళని చూసిన ప్రతిసారీ ఆమంట మండుతుంది. మంట మండిన కొద్దీ ఆకలి. ఏదో తీరని ఆవేదన.

మొగుడు కొట్టినందుకు గాదట, తోడికోడలు నవ్వినందుకట ఆమె ఏడ్చింది. తనకు కీర్తి దాహం తీరకపోతే ఫరవాలేదు. కాని తోటివాళ్ళు, సాటివాళ్ళు ఉన్న చోటనుంచి కదలి ముందడుగు వేస్తున్నారు ఇతరులుగూడా తనతోపాటే ఉండాలనుకోవటం ఒక కోరిక. కామాన్ని జయించాలంటారు వేదాంతులు.

అసలు అదంతా అప్రస్తుతం. ఆకలి చల్లారే విధం తరువాత విచారించుకోవచ్చు. ఇంటికి వెళ్ళటం ఎలా? ఈప్రశ్న మొట్టమొదటనే తోచిందిగాదు. అసలు పెళ్లాంమీద అలిగేవాడే కాదు. ఇంకా నయం. అలిగితే ఏమవుతుందో అనుకొని అలిగేవాడు తను వెనుకటి రోజుల్లో.

వెనుక "ఎమ్ పెడోకిల్స్" అనే ఒక గ్రీకు తత్వశాస్త్రవేత్త అగ్నిపర్వతంలో దూకాడట. ఎందుకు దూకాడు? అతి విచిత్రమైన విషయం. దూకాడనగానే ఎందుకు దూకాడని అడగటం. అగ్నిపర్వతాన్ని చూచాడు. మండుతూన్న ఆ అగ్ని పర్వతంలో మానవుడు దూకితే ఏం జరుగుతుంది? అనే అనుమానం వచ్చింది ఆయనకు. పదిమంది పెద్దమనుష్యుల నడిగాడు. ఏమవుతుంది? చచ్చిపోతాడు. ఈ సమాధానం విని, ఆయనకు విసుగుపుట్టి, మరేదో తప్పక జరిగితీరుతుందని మండే అగ్ని పర్వతంలో దూకాడు. అంతే. ఫలానా పని చేస్తే ఎలా ఉంటుందో? అన్న జిజ్ఞాస. చేయకూడదన్న పనినే చేయాలన్న జిజ్ఞాస మరీ ప్రమాదకరం.

అలా ఉన్నది తన విషయం కూడ. ఏం జరుగుతుందోనని భార్యమీద అలగటం అతి సహజంగా కనిపించింది వెంకట్రావుకి.

వెనుకకు తిరిగి ఇంటివైపు బయలుదేరాడు. భార్యతో మాట్లాడాలి, ప్రతి నిముషమూ ఎన్నో కోర్కెలు. కామాన్ని జయించాలన్నారు వేదాంతులు. కామాన్ని జయించాలనుకోవటం కూడా ఒక కోరికేనేమో! వెంటనే ఆలోచించటం మానేసి, ఇంట్లో అడుగు పెట్టాడు.